సాక్షి
కామారెడ్డి

సోమవారం । 23 । డిసెంబర్ । 2024



ఆదివారం ఆస్పత్రికి సెలవు!
రాజంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం తెరవడం లేదు. దీంతో రోగులు ఇబ్బందిపడుతున్నారు.
- 9లో ▸



మెనూ ప్రకారం భోజనం..
విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
30.9 /16.4

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కాస్త తగ్గే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

24, 25 తేదీల్లో నిరసన కార్యక్రమాలు



కామారెడ్డి టౌన్: పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఈనెల 24, 25 తేదీల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నిరసన కార్యక్రమాలను కాంగ్రెస్ నాయకులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు దేవరాజ్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, నాయకులు గంగాధర్, తేజపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి



కామారెడ్డి టౌన్ : ఎన్నికలకు ముందు సమగ్ర శిక్ష ఉద్యోగులకు రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు నీలం లింగం డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మె ఆదివారం 13వ రోజు కొనసాగింది. సమ్మెకు గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం మద్దతు ప్రకటించింది. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు వాసంతి, నాయకులు సంపత్, రాములు, సంతోష్‌రెడ్డి, శైలజ, కాళిదాసు, వీణ, సాయిలు, లావణ్య, శ్రీను, మాధవి, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే హైదరాబాద్‌కు చిత్రపరిశ్రమ



నిజామాబాద్ సిటీ: కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల ప్రోత్సాహంతోనే నాడు మద్రాస్‌లో ఉన్న తెలుగు చిత్ర పరిశ్రమ హైదరాబాద్‌కు వచ్చిందని, మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి వంటి వారిది ప్రముఖ పాత్ర అని పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగు చిత్రపరిశ్రమపై రాష్ట్ర ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలను ఖండించారు. అన్నపూర్ణ, పద్మాలయ, రామానాయుడు స్టూడియోల నిర్మాణాలకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం స్థలాలు ఇచ్చి ప్రోత్సహించిందని గుర్తుచేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసేవారిని ప్రభుత్వం ఉపేక్షించదని స్పష్టం చేశారు. సంధ్య థియేటర్ ఘటనలో చట్టం తన పని తాను చేసుకుపోయిందని, ఇందులో ఎవరిపైనా కక్ష సాధింపు చర్యలు లేవని పేర్కొన్నారు.

నవోదయ స్కూళ్లకు స్థలం కేటాయించండి



సుభాష్‌నగర్: నిజామాబాద్, జగిత్యాల జిల్లాలకు ఇటీవల కేంద్రం మంజూరు చేసిన నవోదయ విద్యాలయాలకు స్థలం కేటాయించాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో సీఎంను ఆయన నివాసంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో కలిసి కలిశారు. నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు సుమారు 20 ఎకరాల చొప్పున భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాలని కోరడంతోపాటు రెండు జిల్లాల్లో పలు ప్రతిపాదిత స్థలాలను సీఎంకు వివరించారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో కొనసాగుతున్న రైల్వే ప్రాజెక్టులను ఎంపీ అర్వింద్ వివరించారు. ఆర్వోబీల నిధులను గత ప్రభుత్వం మళ్లించిందని, దీంతో సకాలంలో బిల్లులు అందక కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బిల్లులు మంజూరు చేసి, పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చొరవ చూపాలని కోరారు. తమ విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డికి ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు.

నాగలి పట్టని రైతుబిడ్డ!

వ్యవసాయం దినదిన గండంగా మారుతోంది. విత్తనాల నుంచి కోతల వరకు.. ఏటా పెరుగుతున్న సాగు ఖర్చులు రైతుకు దడ పుట్టిస్తున్నాయి. పెరిగిన పెట్టుబడి వ్యయం, గిట్టుబాటు కాని ధరలు, మార్కెట్‌లో దళారుల దందా, స్థిరమైన ఆదాయం లేకపోవడం, ప్రభుత్వాల విధానాలు వెరసి కర్షక కుటుంబాలు సాగుకు దూరమవుతున్నాయి. దీంతో రైతు కుటుంబాలకు చెందిన భవిష్యత్తు తరాలు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల వైపు వెళ్తున్నాయి.



అడ్డగోలుగా పెరిగిన పెట్టుబడులు
- దిగుబడులు అంతంత మాత్రమే..
- వెంటాడుతున్న నష్టాలు
- వ్యవసాయానికి దూరమవుతున్న కుటుంబాలు
- నేడు జాతీయ రైతు దినోత్సవం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో వ్యవసాయ భూములు ఉన్న వారు 2 లక్షలపైచిలుకు మంది ఉన్నారు. ఇందులో రైతు బీమాకు 1.93 లక్షల మంది అర్హులున్నారు. రికార్డుల్లో రైతుల సంఖ్య ఎక్కువే ఉన్నా వారిలో చాలా మంది సేద్యాన్ని వదిలేసి ఇతర పనులు చేసుకుంటున్నారు. జిల్లాలో లక్షన్నరలోపు మంది మాత్రమే వ్యవసాయం చేస్తున్నారని సమాచారం. మిగతా వారు ఇతర వృత్తులు, వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. జిల్లాలో 2.13 లక్షల మంది రైతు కూలీలున్నారు. వీరిలో చాలామంది వ్యవసాయ పనులకు బదులు ఇతర వృత్తుల్లోకి మళ్లారు. చాలా మంది గల్ఫ్ దేశాలకు వలస వెళ్లారు. ఈ ఏడాది వలసలు మరింత పెరిగాయి.

సాగునీటి సమస్య...

జిల్లాలో నిజాంసాగర్ ప్రాజెక్టు ఉన్నా దానికింద కొద్ది శాతం మాత్రమే జిల్లాకు ప్రయోజనం కలుగుతోంది. జిల్లాలో నిజాంసాగర్ నీరు 30 వేల ఎకరాలకు మాత్రమే అందుతోంది. పోచారం ప్రాజెక్టు కింద పది వేల ఎకరాలు మాత్రమే సాగవుతోంది. జిల్లాలో లక్షా 10 వేలకు పైగా బోర్లు, బావులున్నాయి. భారీ వర్షాలు కురిసి భూగర్భ జలమట్టం పెరిగితే తప్ప బోర్లు అనుకున్న స్థాయిలో ఎత్తిపోయడం లేదు. దీంతో బోర్లపై ఆధారపడి చేసిన వ్యవసాయం ఎప్పుడు ఎండుతుందో తెలియని పరిస్థితి ఉంది. దీనికితోడు బోర్లు ఎత్తిపోయినప్పుడల్లా రైతులు కొత్తగా బోర్లు తవ్వించడానికి రూ.లక్షలు అప్పులు చేసి నష్టపోతున్నారు. కొందరు రైతులైతే ఐదారు బోర్లు తవ్వించిన వారున్నారు. చెరువులు, కుంటలు ఉన్నా వాటి కింద ఆయకట్టుకు అవసరమైన మేర నీటిని అందించలేని పరిస్థితి ఉంది. చెరువుల కింద కూడా బోర్లే దిక్కవుతున్నాయి.

రైతును దెబ్బతీసిన యాంత్రీకరణ

ఎద్దు ఎవుసం ఉన్నపుడు రైతులు సొంతంగా దుక్కుల నుంచి బురద పొలం దాకా అన్నీ తామే దున్నుకునేవారు. అవసరమైతే ఇరుగు పొరుగు రైతులను బదలు పిలుచుకుని ఒకరికొకరు సహకరించుకునేవారు. నాట్లు, కలుపు తీయడం, కోతలు.. అన్ని ఇంటి వాళ్లే చేసుకునేది. ఎప్పుడైతే యంత్రాలు అందుబాటులోకి వచ్చాయో రైతులకు పని భారం తగ్గి, ఆర్థిక భారం పెరిగింది. దున్నకాలకు ట్రాక్టర్లు, నాట్లు వేయడానికి కూలీలు లేదంటే మిషన్లు, వరికోతలతో పాటు ఇతర పంటల కోతలకూ హార్వెస్టర్లు అందుబాటులోకి వచ్చాయి. యంత్రాల వాడకంతో పంట సాగుకు అయ్యే పెట్టుబడులు దాదాపు రెట్టింపయ్యాయి.

స్థిరమైన ఆదాయం లేక..

రైతులకు వ్యవసాయంలో స్థిరమైన ఆదాయం లభించడం లేదు. సరైన పంటలు పండక కష్టానికి తగిన ప్రతిఫలం అందడం లేదు. ఏటికేడు పెట్టుబడి వ్యయం పెరుగుతున్న మేరకు వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పెరగడం లేదు. దీంతో రైతు కుటుంబాలు అప్పుల్లో మగ్గిపోతున్నాయి. ఎన్నికల హామీల్లో భాగంగా రుణాలు మాఫీ చేస్తామంటూ పాలకులు ఊరించడం పరిపాటిగా మారింది. మాఫీ ప్రయోజనాలు అందరికీ దక్కకపోవడంతో వారు అప్పుల్లోనే ఉంటున్నారు. పంటల సాగుతోపాటు కుటుంబ పోషణ, పిల్లల చదువులు, వైద్యానికి అయ్యే ఖర్చులు, పెళ్లిళ్లు, ఇళ్ల కట్టుకునే విషయంలో ప్రతి రైతు కనీసం రూ.పది లక్షలైనా అప్పు చేస్తున్నారు. అప్పుల భారం తగ్గకపోవడంతో చాలా మంది భూములు అమ్ముకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జరిగే ఆత్మహత్యల్లో చాలా చావులకు కారణం అప్పులేననేది స్పష్టంగా కనిపిస్తోంది. ఏడెనిమిదేళ్లలో జిల్లాలో 8 వేల మంది రైతులు వివిధ కారణాలతో చనిపోయారు.

మిగులుడు ముచ్చట లేదు



లాగోడికి అప్పు జెయ్యాలె. పంట రాంగనే లెక్కలు వేసుకుంటే ఆడికాడికి అయితుంది. ఒక్కోసారి నష్టం గూడ వస్తుంది. ఏం లాభం లేదు. వానాకాలంల నేను పన్నెండు ఎకరాలు నాటేసిన. లాభం ఏమోగానీ రెక్కల కష్టం కూడా వృథా అయ్యింది. ఎనకట ఎవల పని వాళ్లు జేసుకుని ఏ రంది లేకుండా ఉంటిమి. మిషన్లు వచ్చి ఏది సక్కగ లేకుండపోయింది. ఇప్పటి పోరగండ్లయితే ఎవుసం పని అంటే అంత దూరం ఉరుకుతున్నరు. లాభం లేనిది ఎందుకు చేయాలంటున్నరు. -ఏముల కాశీరాం, రైతు, శేర్‌ఖాన్‌పల్లి

అప్పటి ఎవుసమే మంచిగుండేది



ఎద్దు ఎవుసం ఉన్నపుడు ఏ రంది లేకుండె. లాగోడికీ పెద్దగా ఖర్సయ్యేది కాదు. అన్ని పనులు మేమే చేసుకునేటోళ్లం. ఒకళ్లకు ఒకలు సాయం చేసుకునేటోళ్లం. దున్నడం నుంచి వరి కోయడం దాకా ట్రాక్టర్లు, మిషన్లు వచ్చినయి. ఖర్చులు పెరిగినా దిగుబడి పెద్దగా పెరగలేదు. దీంతో ఎంత కష్టం చేసినా ఏమీ మిగులుతలేదు. ఏటా అప్పులు మాత్రం పెరుగుతున్నయి. వేరే ఏ పని చేయలేక ఎవుసం పట్టుకుని ఏడుస్తున్నం. - కురుమ గంగారాం, రైతు, ఎల్లారెడ్డి



నిజామాబాద్ జీజీహెచ్‌లో మాట్లాడుతున్న వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, వేదికపై ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు

దొంగ లెక్కలు చెప్పొద్దు

- 60 శాతం మంది వైద్యులు గైర్హాజరవుతున్నారు
- నా వద్ద పూర్తి సమాచారం ఉంది
- ఉమ్మడి జిల్లా సమీక్షలో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

నిజామాబాద్‌నాగారం: ''గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్(జీజీహెచ్)లో ఏం జరుగుతుందో నాకు తెలుసు, మీరు నంబర్లను చూపి గొప్పలు చెప్పుకోకండి. నా వద్ద పూర్తి సమాచారం ఉంది. ప్రతిరోజూ 60 శాతం మంది వైద్యులు గైర్హాజరవుతున్నారు. వైద్యులు సమయపాలన పాటించాలి. ప్రైవేట్ ప్రాక్టీస్ చేస్తే చర్యలు తప్పవు. వంద రోజుల్లో మళ్లీ వస్తా.. మార్పు రాకుంటే కఠిన చర్యలు తప్పవు'' అని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌లో వైద్యారోగ్యశాఖ, జీజీహెచ్ అధికారులతో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకు ముందు సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ పవర్ ప్రెజెంటేషన్ ద్వారా తాము అందించిన సేవలను వివరించారు. సరైన సౌకర్యాలు లేకున్నా శస్త్ర చికిత్సలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ క్రమంలో మంత్రి కల్పించుకుని.. మీరు చెప్పే నంబర్లను నమ్మబోనని, గాంధీ, వరంగల్ ఆస్పత్రులకన్నా ఎక్కువ వైద్య సేవలందిస్తున్నట్లు చెప్పడం మానుకోవాలని అసహనం వ్యక్తం చేశారు. రోజూ 40శాతం మంది వైద్యులు మాత్రమే విధులకు హాజరవుతున్నారన్నారు. సూపరింటెండెంట్‌గా బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని ప్రతిమారాజ్‌కు సూచించారు. అనంతరం సమీక్షలో మంత్రి మాట్లాడుతూ ఆస్పత్రులలో 85 శాతం వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి పేదలకు వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవసరమైన చోట సబ్ సెంటర్లు, పీహెచ్‌సీలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు చేపట్టాలని వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఆస్పత్రులలో ఫీజుల నియంత్రణ, సదుపాయాల కల్పనపై నిఘా పెట్టాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రాకేశ్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

రూ.7కోట్లు మంజూరు చేస్తా

జీజీహెచ్‌లో పైపులైన్‌ల లీకేజీ, భవనంపై పిచ్చిమొక్కలు, కిటికీలకు అద్దాలు పగిలిపోవడం, లిఫ్టులు చెడిపోవడం, ఎలుకలు తిరగడంపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. జీజీహెచ్ అధికారుల వినతి మేరకు ఆస్పత్రి అభివృద్ధికి రూ.7 కోట్లు మంజూరు చేస్తామన్నారు. వందరోజుల్లో తాను మళ్లీ వస్తానన్నారు. నెల రోజుల్లో జీజీహెచ్‌లో మార్పు రావాల్సిందేనని స్పష్టం చేశారు.



ప్రమాదకరంగా కామారెడ్డి పెద్దచెరువు రోడ్డు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణం నుంచి పెద్ద చెరువుకు వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా మారినా పట్టించుకునే వారు కరువయ్యారు. జీవదాన్ ఆస్పత్రి, జాతీయ రహదారి, నిజాంసాగర్ చౌరస్తా, లిటిల్ స్కాలర్స్ పాఠశాల, హౌసింగ్ బోర్డు నుంచి పెద్ద చెరువు వైపు వెళ్లే మార్గంలో వానాకాలంలో వరద నీటి ఉధృతికి మురికి కాలువ కూలి దానిని అనుకుని ఉన్న రోడ్డు సైతం కోతకు గురైంది. బతుకమ్మ, గంగమ్మ ఉత్సవాల సందర్భంలో ట్రాఫిక్ పోలీసులు హెచ్చరికగా బారికేడ్‌ను అడ్డుగా పెట్టారు. ఇటీవల రాత్రి వేళ వాహనం బారికేడ్‌ను ఢీకొట్టడంతో అది గోతిలో పడిపోయింది. ప్రస్తుతం ఎలాంటి హెచ్చరిక లేకుండాపోయి ప్రమాదంగా మారింది. కొత్తవారు రాత్రి పూట వాహనంపై వస్తే అమాంతం దానిలో పడి ప్రమాదానికి గురయ్యే అవకాశాలున్నాయి. మురికి కాలువ, గోడ నిర్మించాలని పెద్ద చెరువు కాలనీవాసులు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

కొండను తొలిచి.. రోడ్డుగా మలిచి..



జిల్లా సరిహద్దులో కొండను తొలిచి వేస్తున్న రోడ్డు

మెదక్ –బోధన్ జాతీయ రహదారి పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ క్రమంలో జిల్లా సరిహద్దులోని పోచారం ప్రాజెక్టు వద్ద కొండను తొలిచి రోడ్డు వేస్తున్నారు. ఈ రహదారి నిర్మాణం పూర్తై అందుబాటులోకి వస్తే పర్యాటకులకు పోచారం ప్రాజెక్టు మరింత చేరువ అవుతుంది. – నాగిరెడ్డిపేట

సీఎం గారూ.. పరువు నిలపరూ..

- సొసైటీల్లో రుణాలు తీసుకున్న రైతులు
- అప్పు చెల్లించలేకపోవడంతో వేలానికి సిద్ధమైన బ్యాంకు
- నాడు తలుపులు తీసుకువెళ్తుంటేనే తప్పుపట్టిన రేవంత్‌రెడ్డి
- నేడు వేలం వేస్తున్నా స్పందించకపోవడంపై బాధిత రైతుల ఆవేదన



రేవంత్‌రెడ్డితో గోడు చెప్పుకుంటున్న అంకోల్ గ్రామ రైతులు (ఫైల్)

"లోన్ డబ్బులు చెల్లించనందుకు సహకార బ్యాంకు అధికారులు ఇంటి తలుపులు తీసుకువెళ్లారని అంకోల్ గ్రామ రైతు చెప్పారు. ప్రభుత్వం 6 శాతం సబ్సిడీ ఇవ్వకపోవడంతో రూ.3 లక్షలు లోన్ కాస్తా రూ. 6 లక్షలు అయ్యిందట. అప్పుకు బదులుగా తలుపులు, సైకిల్ మోటార్, కంప్యూటర్లు తీసుకెళ్లడం చూస్తే ఇది నిజాం పాలనగా కనిపిస్తోంది." – ఎన్నికలకు ముందు బాన్సువాడ సభలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి

ఆనాడు బకాయిల వసూలు కోసం రైతు ఇంటి తలుపులు తీయడాన్ని ప్రశ్నించిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ముఖ్యమంత్రి. కానీ ఆయన హయాంలో ఏకంగా రైతుల భూములను వేలం వేయడానికి సహకార బ్యాంకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అప్పట్లో తమ తరఫున మాట్లాడి భరోసా ఇచ్చిన సీఎం.. ఇప్పుడు ఆదుకుని తమ పరువు నిలపాలని బాధిత రైతులు కోరుతున్నారు.

నస్రుల్లాబాద్ : నస్రుల్లాబాద్ మండలంలో గల మైలారం, దుర్కి, నస్రుల్లాబాద్, మిర్జాపూర్, నాచుపల్లి గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్) ఉన్నాయి. వీటి పరిధిలో ఉన్న రైతులు తమ పొలాల అభివృద్ధి కోసం, బోరుబావులు తవ్వించడం కోసం భూములను తనఖా పెట్టి రుణాలు తీసుకున్నారు. అయితే కాలం కలిసి రాకపోవడం, బోర్లు పడకపోవడం, ఆశించిన దిగుబడులు రాకపోవడంతో పలువురు రైతులు అప్పు చెల్లించలేకపోయారు. దీంతో ఏడెనిమిదేళ్ల క్రితం వారు తీసుకున్న అప్పు.. మూడు నాలుగింతలైంది. ఇటీవల బ్యాంకు అధికారులు రుణాల వసూళ్లపై దృష్టి సారించారు. అప్పులు పేరుకుపోయిన రైతులకు నోటీసులు ఇస్తున్నారు. గడువులోగా రుణం చెల్లించలేకపోతే భూములను వేలం వేస్తామని హెచ్చరిస్తున్నారు. భూములను వేలం వేస్తే పరువు పోతుందన్న భయంతో కొంతమంది రైతులు బయట అప్పులు చేసి మరీ సొసైటీ లోన్ చెల్లిస్తున్నారు.

వేలానికి ఏర్పాట్లు..

అంకోల్ తండాకు చెందిన అనూష బాయి భూమి అభివృద్ధి కోసం 2013–14 లో నస్రుల్లాబాద్ సొసైటీలో రూ. 3.70 లక్షలు రుణం తీసుకున్నారు. అది ప్రస్తుతం రూ. 10.29 లక్షలు అయ్యింది. దీంతో భూమిని వేలం వేయడానికి సహకార బ్యాంకు అధికారులు రెండు రోజుల క్రితం ఏర్పాట్లు చేశారు. సదరు రైతు రూ. 2 లక్షలు చెల్లించి గడువు కోరడంతో వేలాన్ని పక్షం రోజులు వాయిదా వేశారు. మండలంలో ఒక్క అనూషబాయి భూమినే కాదు.. త్వరలో మరికొందరి భూములనూ వేలం వేయడానికి సహకార బ్యాంకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈనెల 26న సంగం గ్రామానికి చెందిన రేఖ అనే రైతు భూమిని వేలం వేయనున్నట్లు కరపత్రాలు పంచుతున్నారు. వచ్చే నెలలో మరో 8 మంది రైతుల భూములను వేలం వేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో సహకార సంఘాలలో రుణాలు తీసుకున్నవారు ఆందోళన చెందుతున్నారు. ''శాసనసభ ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి నస్రుల్లాబాద్ మండలం బొమ్మన్‌దేవ్‌పల్లి క్రాస్ రోడ్డు వద్ద బస చేశారు. అనంతరం అక్కడి నుంచి, బాన్సువాడ వరకు పాదయాత్ర చేశారు. మార్గమధ్యలో అంకోల్ క్యాంపు వద్ద అంకోల్ గ్రామానికి చెందిన మహిళా రైతు బ్యాంకు లోన్‌కు సంబంధించి తన గోడు చెప్పుకుంటే.. భరోసా ఇచ్చారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీని నిలబెట్టుకోవాలి'' అని రైతులు కోరుతున్నారు.



అంకోల్ తండాలో భూమిని వేలం వేయడానికి వచ్చిన బ్యాంకు అధికారులు (ఫైల్)

అంత డబ్బు ఎలా తేవాలి



సహకార బ్యాంకులో 2017లో రూ. 5 లక్షలు అప్పు తీసుకున్నాను. ఇప్పుడు రూ. 15,38,044 కట్టాలని బ్యాంకు అధికారులు అంటున్నారు. లేకపోతే ఈనెల 26న నా భూమి వేలం వేస్తామంటున్నారు. అంత డబ్బు ఎక్కడినుంచి తేవాలి.
– పాల్త్య రేఖ, రైతు, సంగం

నోటీసు ఇచ్చారు



2017 లో రూ. 4.32 లక్షలు లోన్ తీసుకున్నా. రెండు వాయిదాలు అంటే దాదాపు రూ. 1.50 లక్షలు పట్టుకుని మిగతా డబ్బు ఇచ్చారు. ఇప్పుడు రూ.7.95 లక్షలు కట్టమంటున్నరు. లేకపోతే వచ్చేనెల 9న వేలం వేస్తామని నోటీస్ ఇచ్చారు.
– పసుపుల లక్ష్మణ్, రైతు, అంకోల్

ఏడు కిస్తీలు కట్టిన



నేను రూ. 3.30 లక్షలు లోన్ తీసుకున్నాను. అందులో నుంచి రూ. 48 వేల చొప్పున 7 కిస్తీలు కట్టాను. ఇంకా రూ. 3.60 లక్షల బాకీ ఉన్నట్లు చెబుతున్నరు. అప్పు కట్టకపోతే భూమి వేలం వేస్తామంటున్నరు.
– కిష్టాగౌడ్, రైతు, బస్వాయిపల్లి

సర్కారు ఆదుకోవాలి



2018లో రూ.5లక్షలు అప్పు తీసుకుంటే.. ఇప్పుడు రూ.14 లక్షలు అయ్యిందట. అప్పు కట్టకపోతే వేలం వేస్తామని చెప్పడంతో రూ. 2 లక్షలు కట్టాను. దీంతో వేలం వాయిదా వేశారు. సర్కారే ఆదుకోవాలి.
– రుక్మిణి బాయి, రైతు, సంగం

క్లుప్తంగా

మెనూ ప్రకారమే భోజనం అందించాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మెనూ ప్రకారమే భోజనం అందించాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని హాస్టల్ వార్డెన్‌కు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భవిష్యత్తులో తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చేలా ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. హాస్టల్ వార్డెన్ రాజేందర్ సిబ్బంది పాల్గొన్నారు.

జీహెచ్‌ఎం సంఘం అసోసియేట్ అధ్యక్షుడిగా లక్ష్మీనర్సయ్య

ఆర్మూర్‌టౌన్‌:పట్టణంలో ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య తెలంగాణ గెజిటె డ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అసోసియే ట్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా లక్ష్మీ నర్సయ్య మాట్లాడుతూ.. హెచ్‌ఎంల సమస్యలు తీర్చడంలో తన కృషిని గుర్తించి ఈ పదవి అందించిన రాష్ట్ర సంఘం అధ్యక్షుడు రాజగంగారెడ్డి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి గిరిధర్‌గౌడ్‌కు, జిల్లాశాఖ కార్యావర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్‌లో సంఘ బలపేతానికి, అభివృద్ధికి కృషిచేస్తానన్నారు.

విద్యుత్ బల్బుగా మారిన సూర్యుడు



సూర్యుడు విద్యుత్ బల్బుగా మారడం ఏమిటని ఆశ్చర్యపోతున్నారా.. అవును నిజమే. సూర్యుడు విద్యుత్ స్తంభం చివరన పెద్ద బల్బు ఆకారంలో దర్శనం ఇచ్చినప్పుడు తీసిన చిత్రమిది. ఈ దృశ్యం మద్నూర్ మండల కేంద్రంలో 'సాక్షి'కి చిక్కింది. – మద్నూర్(జుక్కల్)

ఇసుక పంచాయతీ తెగేనా?

- పుల్కల్, హజ్గుల్ గ్రామాల మధ్య ఇసుక వివాదం
- అధికారులు చర్చలు జరిపినా కుదరని సయోధ్య



బిచ్కుంద(జుక్కల్): ఇసుక వివాదం పుల్కల్, హజ్గుల్ గ్రామాల మధ్య చిచ్చురేపుతోంది. మా గ్రామం మంజీరా నుంచి ఇసుకను తీసుకెళ్లడానికి ఇతర గ్రామాల ట్రాక్టర్లను రానివ్వమంటూ రెండు గ్రామాల మధ్య వివాదం జిల్లా అధికారుల ముందుకు వెళ్లింది. పుల్కల్ శివారులోని మంజీరా నదిలో చెక్ డ్యాం నిర్మిస్తున్నారు. మంజీరా నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలించడానికి ప్రభుత్వం నుంచి అనుమతి లభించింది. ఇళ్ల నిర్మాణాలకు, ప్రభుత్వ అభివృద్ధి పనుల కోసం ఇసుకను తీసుకెళ్లాలని అధికారులు సూచించారు. క్యూబిక్ మీటరు చొప్పున ట్రాక్టర్ యజమానులు ప్రభుత్వానికి చార్జీలు చెల్లించి ఇసుకను తీసుకెళ్తున్నారు. బిచ్కుంద, శెట్లూర్, ఖద్గాం, హజ్గుల్ గ్రామ ట్రాక్టర్లు సీనరేజ్ చార్జీలు చెల్లించి మేము కూడా పుల్కల్ మంజీరా నుంచి ఇసుకను తీసుకెళ్లాడానికి అనుమతి ఇవ్వాలని అధికారులకు కోరారు. ఇతర గ్రామాలకు చెందిన ట్రాక్టర్లను ఇసుక తీసుకెళ్లడానికి రానివ్వమని పుల్కల్ ట్రాక్టర్ల యజమానులు మంజీరాలోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నారు. ప్రభుత్వానికి సీనరేజ్ చార్జీలు చెల్లిస్తున్నాము అందరికి అనుమతి ఉంది ఎందుకు రానివ్వరని హజ్గుల్ ట్రాక్టర్ యజమానులు గొడవకు దిగుతున్నారు. ఇసుక వివాదం రెండు మూడు గ్రామాల మధ్య చిచ్చురేపుతోంది. ఇసుక వివాదం జిల్లా అధికారుల దృష్టికి వెళ్లింది. బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, మైన్స్, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ అధికారులు ఇసుక తరలింపుపై పుల్కల్, హజ్గుల్ రెండు గ్రామాల ట్రాక్టర్ యజమానులతో రెండు రోజుల క్రితం బిచ్కుందలో చర్చించారు. సఖ్యత కుదరలేదు. వివాదం అలాగే ఉంది. ఇసుక లొల్లి ఎక్కడి వరకు దారి తీస్తుందో తెలియని పరిస్థితి ఉంది.

పెంచిన ఇసుక ధరలు..

ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న వారికి ఇసుక బంగారంగా మారింది. బిచ్కుంద చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు మంజీరా పది కిలో మీటర్ల దూరంలో ఉన్నప్పటికి ఇసుక దొరకడం లేదు. పుల్కల్ గ్రామం నుంచి మాత్రమే ఇసుకను తీసుకెళ్లడానికి అనుమతి ఉంది ఇదే అదునుగా భావించిన ఆ గ్రామ ట్రాక్టర్ల యజమానులు ఇసుక ధరలు రెట్టింపు చేశారు. రూ.2 వేలకు లభించే ఇసుక ఇప్పుడు బిచ్కుందలో ఒక ట్రాక్టరు ఇసుక రూ.4 వేలకు విక్రయిస్తున్నారు. పిట్లం, జుక్కల్, కంగ్టి మండలాలతో పాటు మహారాష్ట్ర సరిహద్దులోని గ్రామాలకు విక్రయిస్తే నాలుగు వంతులు లాభం వస్తుంది. దీంతో కొందరు బిచ్కుందలో విక్రయించకుండా ఇతర ప్రాంతాలకు ఇసుక తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ఇతర ప్రాంతాలకు ఇసుక తరలించకుండా, ధరలు తగ్గే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



గొల్ల నవీన్



నితిన్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన ఇద్దరు క్రీడాకారులు కబడ్డీ విభాగంలో సీఎం కప్‌కు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గొల్ల నవీన్, హన్మంతోళ్ల నితిన్ ఇటీవల కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో పాల్గొని తమ ప్రతిభను కనబర్చారన్నారు. దీంతో న్యాయ నిర్ణేతలు వీరిద్దరిని రాష్ట్రస్థాయిలో ఆడేందుకు ఎంపిక చేశారన్నారు. ఈనెల 27, 28, 29వ తేదీలలో మహబూబ్‌నగర్ జిల్లాలో జరుగబోయే పోటీలలో పాల్గొంటారన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జట్టు నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. అలాగే తాడ్వాయికి చెందిన అబ్దుల్ సమీర్, మద్ది విశాల్‌రెడ్డి, పీజీ శ్రీకర్‌యాదవ్ కూడా వాలీబాల్ విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరు ఈనెల 27నుంచి ఖమ్మంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు.

జూనియర్ బాలికల కబడ్డీలో ..

గాంధారి(ఎల్లారెడ్డి): జూనియర్ బాలికల కబడ్డీ రాష్ట్ర స్థాయి జట్టుకు మండల పరిధిలోని పేట్‌సంగెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు సుచరిత, ఉష ఎంపికైనట్లు పీఈటీ లక్ష్మణ్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 20 నుంచి జరిగిన పోటీల్లో ఈ ఇద్దరు బాలికలు మంచి ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. ఈ నెల 23 నుంచి హైదరాబాద్ జరిగే పోటీల్లో పాల్గొంటారని పీఈటీ అన్నారు.



ఎంపికైన పేట్‌సంగెం విద్యార్థినులు సుచరిత, ఉష

జాతీయ స్థాయి అర్చరీ పోటీలకు ఎంపిక



ఎంపికైన దోమకొండ క్రీడాకారులు

దోమకొండ: జాతీయ స్థాయి అర్చరీ పోటీలకు దోమకొండ మండల కేంద్రానికి చెందిన పలువురు క్రీడాకారులు ఎంపికైనట్లు అర్చరీ కోచ్ ప్రతాప్‌దాస్ ఆదివారం తెలిపారు. నిజామాబాద్‌లో జరిగిన 12వ సబ్ జూనియర్ జిల్లాస్థాయి ట్రయల్స్ పోటీల్లో వీరు ఎంపికైనట్లు ఆయన వివరించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25న ఢిల్లీలోని కొల్లూరులో జరిగే పోటీలకు హాజరవుతారన్నారు.

ఉమ్మడి జిల్లాలకు క్యాన్సర్, వాస్క్యులర్ కేంద్రాలు



రెంజల్‌లో మాట్లాడుతున్న మంత్రి

- రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

రెంజల్(బోధన్): ఉమ్మడి నిజామాబాద్, అదిలాబాద్ జిల్లాలకు క్యాన్సర్ చికిత్స కేంద్రాలతో పాటు వాస్క్యులర్ యాక్సెస్ సెంటర్‌లను త్వరలో ప్రారంభిస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. రెంజల్‌లో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా వరకు ప్రభుత్వ ఆస్పత్రుల ద్వార మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా 90 శాతం వరకు ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. అన్ని ప్రాంతాల ప్రజలకు ప్రాథమిక చికిత్స అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 213 నూతన అంబులెన్స్‌లను ప్రారంభించినట్లు మరో 80 నుంచి 85 వరకు అవసరం ఉన్నట్లు తెలిపారు. త్వరలో వాటిని అందుబాటులోకి తెస్తామన్నారు. 102 అమ్మ ఒడి వాహనాలను ఆయా ప్రాంతాలకు సమకూరుస్తామన్నారు. అవసరమైన ప్రాంతాల్లో ఐవీఎఫ్ సెంటర్లను అందుబాటులోకి తెస్తామన్నారు. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, బోధన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మొబిన్‌ఖాన్, నాయకులు నాగభూషణంరెడ్డి, సాయరెడ్డి, దనుంజయ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాఖ మంత్రికి వినతుల వెల్లువ



మంత్రి దామోదర రాజనర్సింహకు సమస్యలను విన్నవిస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు



మంత్రిని కలిసిన రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం సభ్యులు

నిజామాబాద్ అర్బన్/నిజామాబాద్ సిటీ/నిజామాబాద్‌నాగారం: జిల్లాకేంద్రంలో ఆదివారం పర్యటించిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వివిధ పార్టీలు, సంఘాల నాయకులు పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ సురేష్ , డీసీఈబీ సెక్రెటరీ సీతయ్య ఆధ్వర్యంలో సభ్యులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. ప్రధానోపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు. అలాగే జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రిని వెయ్యి పడకల ఆస్పత్రిగా మార్చాలని సీపీఐ నాయకులు మంత్రిని కోరారు. సమగ్రశిక్ష ఉద్యోగులు తమ సమస్యలను మంత్రికి విన్నవించారు. మంత్రికి పలు సమస్యలను విన్నవించడానికి వచ్చిన ఎంఐఎం నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. చివరకు మంత్రికి విన్నవించడానికి అనుమతించారు. ఏఐటీయూసీ, వివిధ సంఘాల ప్రతినిధులు మంత్రికి పలు సమస్యల పరిష్కారానికి విన్నవించారు. డాక్టర్ కవితా రెడ్డి సైతం మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్‌సీడీ క్లినిక్ ప్రారంభం

నిజామాబాద్‌నాగారం: జీజీహెచ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్‌సీడీ క్లినిక్‌ను మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించారు. అలాగే ఎంసీహెచ్‌లోని నూతన భవనంలో క్రిటికల్ కేర్ విభాగాన్ని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా ప్రారంభించారు. జీజీహెచ్ ఆవరణలో కొత్తగా 108 అంబులెన్సును పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు.



ఎన్‌సీడీ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి



జీజీహెచ్‌లో అంబులెన్స్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



ఎంసీహెచ్‌లో క్రిటికల్ కేర్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

మంత్రికి స్వాగతం



జిల్లా పర్యటన కోసం విచ్చేసిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు నూతన కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా ఉన్నతాధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అలాగే టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో నాయకులు స్వాగతం పలికారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీహనుమంతు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు సుమన్, జిల్లా కార్యదర్శి శేఖర్, రమణారెడ్డి, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.



జీజీహెచ్ అధికారులపై మంత్రి ఆగ్రహం





నిజామాబాద్ నాగారం: జిల్లా కేంద్రంలోని జీజీహెచ్ భవనాన్ని మంత్రి చూసి అసహనం వ్యక్తం చేశారు. భవనంపై పిచ్చిమొక్కలు పెరిగి ఉండడంతోపాటు, కిటికీలు పగిలి అధ్వానంగా ఉంది. దీంతో మంత్రి జీజీహెచ్ భవనం ఇలాగే ఉంటుందా అంటు సూపరింటెండెంట్‌పై సీరియస్ అయ్యారు.

రోగులతో ఆప్యాయంగా మాట్లాడిన మంత్రి



నిజామాబాద్‌నాగారం: జీజీహెచ్ ఆవరణలోకి ప్రవేశించిన మంత్రి దామోదర రాజనర్సింహ ముందుగా ఓపీ బ్లాక్‌ను పరిశీలించారు. అనంతరం సమీక్షకు వెళుతుంటే మంత్రిని రోగులు పిలవడంతో ఆ ప్యాయంగా మాట్లాడారు. ఏమైందమ్మ చెప్పు అంటు సమస్యను విని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం ఆరోగ్య శ్రీ సేవల నిమిత్తం ఉన్న ఆరోగ్య మిత్రతో కాసేపు మాట్లాడారు. అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు.

రాష్ట్రస్థాయి సీఎం కప్ కబడ్డీ ఇన్‌చార్జిగా ప్రశాంత్



ప్రశాంత్

నిజామాబాద్ నాగారం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ టోర్నమెంట్‌లో భాగంగా నిజామాబాద్ జిల్లా కబడ్డీ కోచ్, జాతీయస్థాయి క్రీడాకారుడు మీసాల ప్రశాంత్ కబడ్డీ టోర్నమెంట్‌కు ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఈ నెల 27నుంచి 30వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల, మహిళల కబడ్డీ టోర్నమెంట్‌కు ఆయన ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించనున్నారు. జిల్లా కోచ్‌కు ఈ అవకాశం రావడంపై జిల్లా క్రీడాకారులు, క్రీడా సంఘాల అధ్యక్ష కార్యదర్శులు ఆయనకు అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఆర్చరీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

నిజామాబాద్ నాగారం: రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఉమ్మడి జిల్లాల క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా ఆర్చరీ సంఘం కార్యదర్శి నరసింహారెడ్డి తెలిపారు.నిజామాబాద్ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖేలో ఇండియా అర్చ రీ ట్రైనింగ్ సెంటర్ రాజారం స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ కొల్లూరులో డిసెంబర్ 25న జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ఖేలో ఇండియా అర్చరీ కోచ్ మద్దుల మురళి, పీటీ పీరియా ప్రతాప్ దాసులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

దుబాయ్‌లో గుండెపోటుతో మాక్లూర్ వాసి మృతి



ఫారత్ (ఫైల్)

మాక్లూర్: బతుకుదెరువు కోసం మండల కేంద్రం నుంచి దుబాయ్ వెళ్లిన ఫారత్ (40) శనివారం గుండెపోటు వచ్చి మృతిచెందినట్లు మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు. ఫారత్ 15 రోజుల క్రితమే దుబాయ్ వెళ్లాడని, ఇంతలోనే అతడు గుండెపోటుతో మృతి చెందాడన్న విషయాన్ని తట్టుకోలేకపోతున్నామని కుటుంబ సభ్యులు ఆదివారం విలపిస్తూ చెప్పారు. ఆయనకు భార్య, పాప ఉన్నారు. మృతదేహన్ని స్వగ్రామానికి త్వరగా రప్పించాలని అధికారులు, నాయకులను కోరుతున్నారు.

టిప్పర్ పట్టివేత



రెంజల్(బోధన్): మండలంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను శనివారం సాయంత్రం పట్టుకున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. నీలా చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేస్తుండగా టిప్పర్ రావడంతో నిలిపివేసి ధ్రువపత్రాలను పరిశీలించినట్లు చెప్పారు. ఇసుకకు సంబంధించి అధికారుల అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్‌కు అప్పగించినట్లు వివరించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 12మందిపై కేసులు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం పోలీసులు వాహనాలను తనిఖీలు చేశారు. అలాగే వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా 12మంది మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. దీంతో వారిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మద్యం తాగి ఎవరైనా వాహనం నడిపితే వారిపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు. ఎస్సై షరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో లేగదూడ మృతి

మోపాల్: మండలంలోని మంచిప్ప గ్రామంలో కుక్కల దాడిలో లేగదూడ మృతిచెందినట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. గ్రామంలోని కిరణ్‌కు చెందిన లేగదూడను శనివారం రాత్రి పాకలో వదిలేశారు. రాత్రిపూట కుక్కలు లేగదూడను వెంబడించి తీవ్రంగా గాయపరిచాయి. ఉదయం కిరణ్ పాక దగ్గరకు వెళ్లి చూడగా దూడను కుక్కలు చుట్టుముట్టాయి. దాడిలో లేగదూడ అక్కడికక్కడే మృతిచెందింది. గ్రామంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

మల్కాపూర్‌లో కొండచిలువ కలకలం



బీబీపేట: మండలంలోని మల్కాపూర్ గ్రామంలోగల ఓ పొలంలోని బావి వద్ద కొండ చిలువ ఆదివారం కలకలం సృష్టించింది. గ్రామానికి చెందిన గోవిందరాజు ఎప్పటిలాగే వ్యవసాయ పనుల నిమిత్తం బావి వద్దకు వెళ్లగా కొండచిలువ కంటపడింది. వెంటనే అప్రమత్తమై చుట్టుపక్కల రైతులకు సమాచారం అందించగా వారు వచ్చి కొండచిలువను చంపేశారు. కొండచిలువ సుమారు రెండు మీటర్ల పొడవుతో 5 కిలోల బరువు ఉందని రైతు తెలిపారు. గతంలో సైతం ఇదే శివారులోని పలువురి పొలాల్లో కూడా కొండ చిలువలు కనిపించడంతో స్థానికులు చంపేశారు. ప్రతిసారి ఇలా ప్రత్యక్షం అవడంతో రైతులు అందోళన చెందుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవోదయలో సమావేశమైన 1993-94 ఆరవ తరగతి విద్యార్థులు

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆదివారం 1993, 94 ఆరో తరగతి బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఆనాటి మిత్రులందరూ చాలా ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో చిన్ననాటి జ్ఞాపకాలు, ప్రస్తుత వ్యాపకాలు, ఉద్యోగం, స్థిరనివాసాలపై ఒకరినొకరు చెప్పుకుంటూ, పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆటపాటలు, నృత్యాలతో విద్యార్థులు ఉత్సాహంగా గడిపారు. పూర్వ విద్యార్థులు వినయ్‌కుమార్, అనిల్‌కుమార్, రేణుకాకుమారి, నాగవేందర్, విజయ్‌రాజ్, నవీన్‌కుమార్, రాజబాబు, విక్రమ్, నరహరి, గంగమోహన్, శోభ, రేఖ, సరిత, అనిత ఉన్నారు.

దేవునిపల్లిలో..

కామారెడ్డి అర్బన్: దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2004-05 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇరువై యేళ్ల తర్వాత కలుసుకోవడంతో ఆనాటి జ్ఞాపకాలను, మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులను ముఖ్యఅతిథులుగా ఆహ్వానించి, జ్ఞాపికలను అందజేసి శాలువలతో సన్మానించారు. ఉపాధ్యాయులు సత్యం, ఉపేందర్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల నృత్య ప్రదర్శన



దేవునిపల్లి జెడ్పీహెచ్‌ఎస్ 2004-05 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు